విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 24, జూలై 2024

## స్వాతంత్రోద్యమ నాయకుల జయంతి వేడుకలు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ** : పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి పాఠశాలలో స్వాతంత్రోద్యమ నాయకుల జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రైవేట్ పాఠశాలల డివిజన్ అధ్యక్షులు అమీర్ బాష ఆధ్వర్యంలో కేవి సుబ్బారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబన్న సమక్షంలో స్వరాజ్యమే నా జన్మహక్కని చాటి చెప్పిన బాలగంగాధర తిలక్, బ్రిటిష్ వారి గుండెల్లో రైలు పరిగెత్తించిన విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# ప్రత్యేక హోదాపై పెదవి విప్పకపోవడం దుర్మార్గం

**విశాలాంధ్ర - నంద్యాల** : కేంద్ర బడ్జెట్ ఉన్నత వర్గాలకు అనుకూలంగా, దక్షిణాది రాష్ట్రాలలో జరిగే ఎన్నికలను అనుకూలంగా ప్రవేశపెట్టి ప్రత్యేక హోదాపై పెదవి విప్పకుండా అమరావతికి బడ్జెట్ కేటాయించమని ప్రకటించడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్పొరేట్లకు, ప్రైవేటీకరణకు అనుకూలమైన బడ్జెట్‌గా ఉందని, అమరావతి రాజధానికి 15 వేల కోట్లు కేటాయించామని ప్రకటించడం రాష్ట్రానికి ద్రోహం చేసినట్లేనని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా రైతులు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలు చేసుకుంటుంటే, వారికి రుణమాఫీ గురించి ఒక్క మాటైనా చెప్పలేదని, ప్రకృతి వ్యవసాయం పెంచుతామని చెబుతున్నారని, దేశంలో యువత కోట్లాదిమంది నిరుద్యోగులుగా తక్కువ వేతనాలతో పనులు చేస్తుంటే వారికి కనీస వేతనాలు అమలు పరుస్తామని ఈ బడ్జెట్లో కేటాయించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి 48 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆదాయం 32 లక్షలు మాత్రమే ఉందని, భవిష్యత్తులో ప్రజలపై భారాలు మోపేందుకు కుట్ర జరుగుతుందని, ఈ బడ్జెట్లో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేదిగా లేదని, ఉన్నత వర్గాలకు అనుకూలంగా ప్రవేశపెట్టడం దుర్మార్గమని,రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేవలం అమరావతికి 15 వేల కోట్లు ఇచ్చి, పోలవరం పూర్తి చేస్తామని, రాయలసీమను అభివృద్ధి చేస్తామని మోసపూరిత మాటలు చెపుతున్నారని ఆయన మండిపడ్డారు. రాయలసీమలో ఉన్న కడప ఉక్కు ఫ్యాక్టరీ గురించి, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయమని చెప్పడం లేదని, విశాఖ రైల్వే జోన్ గురించి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసినట్లే అని రంగనాయుడు విమర్శించారు.

# దొంగల బెడదతో రైతుల ఆందోళన

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల** : పంటలు సాగు చేస్తున్న రైతన్నలు దొంగల బెడదతో ఆందోళన చెందుతున్నారు. రాత్రిల్లు వ్యవసాయ బోర్లాకు అమర్చిన విలువైన రాగి వైర్‌ను గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడుతున్నడంతో కలవరం చెందుతున్నారు. మండలంలోని మదనంతపురం గ్రామ పరిధిలో పలువురి రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న రాగి వైరును గుర్తుతెలియని దొంగలు సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం బోర్ల వద్దకు వెళ్లిన రైతులకు చోరీ విషయం బయటపడింది. గ్రామానికి చెందిన గంగరాజు, ప్రతాప్ రెడ్డి, సాకం సుంకిరెడ్డి, చెక్క రామాంజనేయులు, యాతం శివ నారా యణ రెడ్డి, కృష్ణారెడ్డి తదితర రైతులకు చెందిన 12 వ్యవ సాయ బోర్లకు ఉన్న విలువైన రాగి వైర్‌ను దుండగులు ఎత్తు కెళ్లారు. దొంగల బెడద రోజురోజుకు ఎక్కువ అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్టార్టర్ బాక్స్ నుండి బోరు బావి మోటర్కు అమర్చిన రాగి వైర్‌ను దుండగులు కట్ చేసి పట్టుకెళ్ళారు. ఒకొక్క బోర్ బావి వద్ద నుండి తీసుకువెళ్లిన రాగి వైర్ విలువ దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుందని రైతులుతెలిపారు. అంతే కాక కొత్త వైర్‌ను అమర్చుకోవాలంటే బోరు బావిలోని పైపులను వెలికి తీసే వాహనాన్ని బాడుగకు పిలుచుకోవలసి వస్తుందని వాపోయారు. బాధిత రైతులు స్థానిక పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టుకొని న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# సంక్షిప్త సమాచారం

### బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యత..

**విశాలాంధ్ర - బనగానపల్లె:** కేంద్ర బడ్జెట్లో ఏపీకి అధిక ప్రాధాన్యత ఇచ్చారని టీడీపీ వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి సీనయ్య అన్నారు. మంగళవారం సీనయ్య తన కార్యాలయంలో మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు తూర్పు రాష్ట్రమైన ఏపీకి పూర్వోదయ పథకం కింద ప్రత్యేక ప్యాకేజీలు, పోలవరం త్వరగా పూర్తికి హామీ, విశాఖ చెన్నై, ఓరుకల్లు బెంగళూరు ఇండస్ట్రీ కార్డిదార్ల అభివృద్ధి రాయలసీమ, ప్రకాశం, కోస్తాలలో వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సహాయం కేటాయించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి..

**విశాలాంధ్ర -ఉయ్యాలవాడ:** మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రఘురాం సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీలలో మాయలూరు, 26,27 తేదీలలో హరివరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, చిరునామా, ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వోగం చేసుకోవాలని కోరారు.

### మహిళలకు టైలరింగ్ పై ఉచిత శిక్షణ..

**విశాలాంధ్ర - బనగానపల్లె:** యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం, ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు టైలరింగ్, డిసైన్ బ్లౌజుల, జ్యూట్ బ్యాగుల తయారీపై రెండు నెలల ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళలు, యువతులు ఈ నెల 31లోగా ఈ నంబర్‌ను 9441192765 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవలసినదిగా తెలపడమైనది.

### మినుము పైరులో పురుగుల నివారణ చర్యలు

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల** : పట్టణంలో మంగళవారం వ్యవసాయ అధికారి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వ్యవసాయ అధికారి నిరంజన్ మాట్లాడుతూ అధిక వర్షాల వలన సూక్ష్మధాతూ పోషకాలు ముఖ్యంగా ఐరన్ లోపం వలన ఆకులు పసుపు రంగులోకి మారుతా యన్నారు. దీని నివారణకు అన్నభేది ఫెర్రస్ సల్ఫేట్ 5 నుంచి 8 గ్రాములు లీటర్ నీటికి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటర్ నీటికి కలిపి క్లోరోపైరి పాస్-2 ఎంఎల్,లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాల న్నారు. సూక్ష్మ ధాతు పోషక లోపాలను, ఆకులను నాశించు చిత్తపురుగులు రసం పీల్చే, పురుగులను నివారించుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారి నిరంజన్ తెలిపారు.

### ప్రజా అవసరాల కోసం నూతన బ్రిడ్జి ..

**విశాలాంధ్ర - బనగానపల్లె:** ప్రజా అవసరాల కోసం బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర్ రెడ్డి తెలిపారు. మండలం లోని యాగంటి పల్లె గ్రామంలో బ్రిడ్జి పనులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు వేగవంతంగా నాణ్యతతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

### మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి..

**విశాలాంధ్ర - పాములపాడు** : మండలంలోని, మిట్టకందాల గ్రామంలో మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్ ను పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు మాదిగ ఎంపీడీవో వి.సరస్వతికీ మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత టీడీపీ హాయంలో మిట్టకందల గ్రామంలో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి, వాటర్ ప్లాంట్ నిర్మించి ప్రజలకు మంచినీటి సరఫరా అందించాలని కోరారు. మలేరియా డెంగ్యూ అతిసార వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అనారోగ్యాల నుండి కాపాడారాని ఆయన అన్నారు. ప్రతిరోజు మిట్టకందాల గ్రామ ప్రజలు శుద్ధ జలాల కోసం మండల కేంద్రమైన పాములపాడు మండలానికి రావాల్సి వస్తుందని, ఈ వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను మళ్ళీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

### రోగులకు మెరుగైన వైద్యం అందించండి..

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల** : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా డిస్టిక్ కోఆర్డినేటర్ అధికారి జఫ్రుల్లా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన అన్నారు. ఆసుపత్రులను రోగులతో మాట్లా డుతూ వైద్య సేవలు వివరాలపై ఆరా తీశారు. వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### అస్వస్థతకు గురైన కూలీల ఘటనపై పరామర్శ..

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ** : మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామంలో సోమవారం పురుగుమందు ప్రభావంతో 20 మందికి పైగా కూలీలు అస్వస్థతకు గురై కొందరు నంద్యాల ఆసుపత్రిలో, కొందరు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పురుగుమందు ప్రభావంతోనే వారు అస్వస్థతకు గురికావడం జరిగిందన్నారు. ప్రస్తుతం నంద్యాలలో చికిత్స పొందుతున్న వారంతా కోలుకున్నారని, మంగళవారం సాయంత్రం డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి:** జిల్లాలో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన అతిసారం, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ప్రజలు కలుషిత నీరు కలుషిత ఆహారం తీసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్వో వివరించారు. ఈ సమావేశంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

# పరిశుభ్రత పాటిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించండి

**విశాలాంధ్ర - నంద్యాల:** సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, టాయిలెట్లు, తాగునీరు తదితర సదుపాయాలపై పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో రోజుకు ఎన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, అత్యవసర సమయాలలో ఎవరెవరు పని చేస్తున్నారు, ఏ సమయం నుండి వైద్య సర్వీసులు అందిస్తున్నారు, వైద్య పరికరాల కొరత ఏమైనా ఉందా తదితర అంశాలపై కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చిన్నపిల్లల డాక్టర్ అవసరం ఉందని వైద్య సిబ్బంది కలెక్టర్‌కు నివేదించారు. 2020 సంవత్సరం నుండి ఆసుపత్రి భవనం నిర్మాణంలో వుందని, పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నిర్మాణంలోనున్న అసంపూర్తి ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలి

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్ ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి, తాపీ వర్కర్స్ యూనియన్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణం నందు స్థానిక తాపీ వర్కర్స్ యూనియన్ ఎస్ రహమతుల్లా అధ్యక్షతన పగిడ్యాల రోడ్డు నందు ఉన్న మహమ్మదీయ షాది ఖానా నందు జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రఘురాంమూర్తి మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 2019లో మాజీ స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సంక్షేమ బోర్డు నందు రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు నందు నాలుగు లక్షల మంది సభ్యులుగా చేరడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికులకు ఏడు రకాల పరిహారం రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చేవారని, అయితే వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రూ.18 వందలకోట్లు నవరత్నాల సంక్షేమ పథకాల మళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 వేలమంది కార్మికులు సంక్షేమ బోర్డుకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాలలో ఒక్కరికి పరిహారం ఇవ్వలేదని వారన్నారు. ఇప్పుడు ఏర్పడిన నూతన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని, 32 వేల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి పరిహారం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాపీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు జీఎం నూర్ అహ్మద్, బి.అయూబ్, ఎస్.కాజా హుస్సేన్, ఎస్.వలి, ఎస్.జిలాని, ఏఐఎస్ఎఫ్ తాలూకా నాయకులు మహానంది, వినోద్‌లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ పట్ల ఎంపీ బైరెడ్డి శబరి హర్షం

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** విభజిత ఏపీకి మేలు చేసే బడ్జెట్ ఉందని, మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర బడ్జెట్ 2024-25 ఆహార, ఇంధనేతర ద్రవ్యోల్బణం 3.1 శాతానికి పరిమితమైందని దేశవ్యాప్తంగా అన్ని పంటలకు మద్దతు ధరలు గణనీయంగా పెంచేందుకు కనీసం 50 శాతం మిగులు ఉండేలా మద్దతు ధరలు సవరించేందుకు ద్రవ్యోల్బణం 4 శాతానికి పరిమితం చేయాలనే లక్ష్యంతో సాగుతుందన్నారు. ఉపాధి, నైపుణ్య శిక్షణ, ఎంఎస్ఎంఈ, మధ్యతరగతి కేంద్రంగా బడ్జెట్ వాతావరణ మార్పులకు అనుగుణంగా నూతన వంగడాలు వ్యవసాయంలో ఉత్పాదకత పెంపు, స్వయం సమృద్ధి సాధించడం ప్రధానం అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం, అవసరాన్ని బట్టి అమరావతికి మరిన్ని అదనపు నిధులు పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం, పోలవరానికి కావాల్సిన నిధులు కేటాయింపు హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు రాష్ట్రానికి, రైతులకు జీవనాడి పోలవరమని, భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైందన్నారు.

## వైద్య పరీక్షలు నిర్వహించండి

**విశాలాంధ్ర- ఉయ్యాలవాడ:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహంలో 15 రోజుల వ్యవధిలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని స్థానిక వైద్యాధికారిని అపర్ణను డీఎంహెచ్ఓ వెంకటరమణ ఆదేశించారు. మంగళవారం బాలికల వసతి గృహాన్ని అమీనియా యుక్త భారత్ కార్య క్రమంలో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో బాలికలకు సరఫరా చేసే మంచినీటి ట్యాంకు, భోజన సదుపాయాలకు సంబంధిం చిన మెనూ, విద్యార్థినిలు ఉండే గదులు, మంచాలు, ఫ్రిజ్లో నిలువ చేసిన కూరగాయలను పరిశీలించారు. మంచాలపై వేసిన బెడ్లపై బెడ్ షీట్లు లేకపోవడంపై వసతి గృహ అధికారిని మాధవిని ఆరా తీశారు. కరోనా సమయంలో ఇక్కడ ఉన్న బెడ్లు బెడ్ షీట్లు ఆసుపత్రులకు రెఫర్ చేశారని, ఇంతవరకు ప్రభుత్వం మళ్ళీ విద్యార్థినిలకు బెడ్ షీట్లు సరఫరా చేయలేదని వివరించారు. పౌష్టికాహారంలో భాగంగా పాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్ కు సూచించారు. రక్తహీనత కలిగిన విద్యార్థినులను అవసరమైతే మెరుగైన వైద్య సేవలు నిమిత్తం జిల్లా వైద్యశాలకు రెఫర్ చేయాలని వైద్యాధికారినికి సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో డెంగ్యూ, మలేరియా జ్వరాలు సోకే ప్రమాదం ఉందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌కు సూచించారు.

## రజకులపై దాడులను అరికట్టాలి

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల:** రాష్ట్రవ్యాప్తంగా రజకులపై దాడులు రోజు రోజుకు అధికమయ్యాయని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని అఖిల భారత రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కంబగిరి స్వామి డిమాండ్ చేశారు. రజక సంఘం జిల్లా అధ్యక్షులు సి.నాగేంద్ర, నాగరాజు, శ్రీనివాసులు, మద్దయ్య, రాము తదితర నాయకులతో కలిసి నంద్యాలకు వెళ్లి జిల్లా కలెక్టర్ రాజ కుమారి, ఎస్పీ ఆదిరాజ్ రానాలకు దాడులను అరికట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నెలలో జిల్లాలో రజకులపై హత్యాయత్నాలు, హత్యలు జరిగాయన్నారు. దాడులపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కులాలకు అతీతంగా పుట్టుక నుండి చావు వరకు సేవలుఅందించే రజకులపై దాడులు శోచనీయమన్నారు. దాడులకు గురై ప్రాణాలు కోల్పోయిన జిల్లాలోని పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన లింగస్వామి, ఆళ్లగడ్డ మండలం ఎస్ లింగం దిన్నె గ్రామం చాకలి శ్రీనివాసులు, ధర్మవరం మండలం వెల్దుర్తి గ్రామం సూర్యనారాయణ కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

## డీఎస్సీ ఆఫ్ లైన్‌లోనేనే నిర్వహించాలి

**విశాలాంధ్ర - నంద్యాల** : డీఎస్సీ ఆఫ్ లైన్లో నిర్వహిం చాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అజాం బేగ్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయు బేతం చెర్ల ప్రాంతీ య కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018 నుండి టెట్, డిఎస్సీని ఆన్లైన్లో వివిధ సెషన్లలో నిర్వహిస్తుందని, అప్పట్లో ఆరు లక్షల మందికి పైగా డిఎస్సీ అభ్యర్థులు ఆన్లైన్ డిఎస్సీ పరీక్షను వ్యతిరేకించారని, దీనివల్ల ప్రశ్నాపత్రం కఠిన స్థాయి ఒక్కో సెషన్లో ఒక్కో విధంగా ఉంటుందన్నారు. విద్యార్థుల మార్కుల్లో చాలా తేడా ఉంటుందన్నారు. టెట్‌లో వచ్చిన మెరిట్‌ను డిఎస్సీ మార్కులకు కలపడం వల్ల డిఎస్సీ మొత్తం మార్కుల్లో తేడా వస్తుందన్నారు. ఆన్లైన్ పరీక్షలను రద్దుచేసి వెంటనే ఆఫ్లైన్ పరీక్షా విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

# శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించండి

**విశాలాంధ్ర - నంద్యాల:** దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడమే ఆశయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పకట్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రధానోపాధ్యాయులను సూచించారు. మంగళవారం నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యా నైపుణ్యాలపై పిల్లలకు స్పష్టంగా అర్థమయ్యే రీతిలో శిక్షణ ఇవ్వాలని, విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేసామని అన్నింటినీ ప్రతిరోజూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరఫరా చేసిన యూనిఫామ్‌ను త్వరగా కుట్టించుకుని జిల్లాలోని విద్యార్థులందరూ ఆగస్టు ఒకటవ తేదీనుండి తప్పనిసరిగా యూనిఫామ్ ధరించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ సుధాకర్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. యూనిఫామ్ ధరించే విషయంలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవన్నారు. అనంతరం పాఠశాలలో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫౌండేషన్ ఇన్ లీటరసీ అండ్ నుమరసి భాష, గణితంలో మూలభావనల కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. గణితంలో ఉపాధ్యాయులు సంఖ్యా భావనలు, చతుర్విధ గణిత ప్రక్రియలపై తయారు చేసిన వివిధ నమూనాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న 93 విద్యార్థుల ఎన్రోల్మెంట్‌ను 120 మంది విద్యార్థులు ఎన్రోల్మెంట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని హెడ్మాస్టర్ ను ఆదేశించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత, ఎంఇఒ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

**విశాలాంధ్ర - వెలుగోడు** : మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన ఉపాధి హామీ పథకానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. రేగడ గూడూరుకు చెందిన లింగన్న, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన సురేష్, గుంతకందాల గ్రామానికి చెందిన నాగార్జున, మోత్కూరు గ్రామానికి చెందిన నవీన్ కుమార్ రెడ్డి రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో శ్రీనివాసులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మల్లికార్జున పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో పథకాలు అందుకున్న అర్షుఅంజు

**విశాలాంధ్ర - నంద్యాల** : క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తున్న అర్షు అంజు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌ని వారి కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చాలామంది అమ్మాయిలు ఆటలు అంటేనే వెనకడుగు వేస్తారని తల్లిదండ్రుల ప్రోత్సా హం అంతగా ఉండదని, అందులోనూ ఇతరులతో ముఖాముఖి తలపడే క్రీడల వైపు మొగ్గుచూపేవారు చాలా తక్కువగా ఉంటారని, ఇలాంటి సవాలను స్వీకరించి ఆటలో దూకుడు ప్రదర్శిస్తూ కుస్తీ, హాకీ, పవర్ లిఫ్టింగ్, గ్రాప్లింగ్ లో అద్భుత ప్రతిభ చాటుతూ జాతీయస్థాయిలో రాణిస్తూ పథకాలు, ప్రశంసలు అందుకుంటున్న నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన రజియాబి, దస్తగిరి దంపతుల కుమార్తె అర్షు అంజును ఆయన అభినందించారు. క్రీడల్లోనే కాకుండా చదువులో కూడా మంచి ప్రతిభ చూపుతుందని, ఇలాంటి ప్రతిభ ఉన్నవాళ్లకి ఎల్ల వేళలా తన సహాయ సహకారాలు ఉంటాయని ఫిరోజ్ తెలియజేశారు.

## కుష్టు వ్యాధి సర్వేను పగడ్బందీగా చేపట్టండి

**విశాలాంధ్ర- అవుకు:** అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తుల పరిశీలన సర్వేలను పకడ్బందీగా చేపట్టాలి అని ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనుమానిత కుష్టి వ్యాధిగ్రస్తులను పరిశీలించడం జరిగిందని అన్నారు. ఒకరికి వ్యాధి నిర్ధారణ చేయడం జరిగిందని అన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపుగా 9 వేల మందిని సర్వే చేయడం జరిగిందని వీరిలో 102 మందికి అనుమానిత కేసులుగా నమోదు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి అనుమానిత కేసును నిర్ధారణకు వైద్యాధికారి దగ్గరికి పంపాలని అన్నారు. వచ్చేనెల 2వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ యమున, డాక్టర్ నవీన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వాసంతి కుటుంబ బాధితులకు ఆర్థిక సాయం



**విశాలాంధ్ర - నందికొట్కూరు:** నియోజవర్గ పరిధిలోని ముచ్చుమర్రి గ్రామంలో మైనర్ బాలిక అయినా చిన్నారి వాసంతి హత్యకు గురైన వారి కుటుంబ సభ్యులకు మంగళవారం ముచ్చుమర్రి గ్రామంలో ఎస్సీల నుండి సేకరించిన లక్ష రూపాయల నగదును స్వయంగా వారి సమక్షంలోనే నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇరువర్గాలు ఎలాంటి ఘర్షణను చోటు చేసుకోకుండా గ్రామంలోని ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడిపి సీనియర్ నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, కట్టుబడి శ్రీనువాసులు నాయుడు, జయరామి రెడ్డి, నాగన్న, గూడూరు రవికుమార్ రెడ్డి, డాక్టర్ కరీం, సర్పంచ్ వెంకట్, మాదిగ శివన్న, డీలర్ వెంకటరమణ, పెద్ద రంగడు, చిన్న రంగడు, బోయ రామకృష్ణ, చిన్న దంచాలు, తదితరులు పాల్గొన్నారు.

## 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**విశాలాంధ్రు-హొళగుంద** : మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరణికి తాండకొండలో మంగళవారం ఎస్సై పెద్దయ్య నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ దాడులు నిర్వహించారు. సుమారు 800 లీటర్ల బెల్లం ఊటను, బిందెలను ధ్వంసం చేశారు. 10 లీటర్ల నాటు సారును సీజ్ చేశారు. ఎస్సై పెద్దయ్య నాయుడు మాట్లాడుతూ మండలంలో అక్రమ నాటు సారా, కర్ణాటక మద్యం అమ్మకాలు తయారు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 24, జూలై 2024



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నచోటనే కొనసాగించాలి

**విశాలాంధ్ర – ఆదోని :** పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నచోటు నుండి ఆరెకల్ తరలించడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ బాష, వైసీపీ నాయకుడు బసాపురం లింగప్పలు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి విద్యార్థి సంఘాల అనేక పోరాటాలు చేసి సాధించుకున్నటువంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గత సంవత్సరం తరగతులు ప్రారంభిస్తామని అధికారులు ఆదోని పట్టణంలో ఉన్నటువంటి వైఎంకే స్కూల్లో తరగతులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పుడు బిల్డింగ్ రెంటు కట్టక కాలేజ్ తరగతులు ఆరెకల్లో ఉన్నటువంటి ప్రభుత్వ మైనార్టీ ఐటిఐ కళాశాలకు మారుస్తామని చెప్పడం సరైనది కాదన్నారు. ఆదోని ప్రాంతం నుండి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో కళాశాలను మారిస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులు, మహిళా విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు అవ్వడం ద్వారా విద్యార్థులు డ్రాప్ అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అడ్మిషన్లు దాదాపు 120 వరకు పెరిగాయని, హఠాత్తుగా ఉన్నట్టుండి కళాశాల మారిస్తే, అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు సెకండ్ వెబ్ ఆప్షన్‌లో వేరే కాలేజ్‌లకు మార్చుకునే అవకాశం ఉంటుంది కాబట్టి ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు ఆలోచించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పట్టణంలోనే యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, నాయకులు, శివ, లక్కీ, రామకృష్ణ, విద్యార్థి సంఘాలు చరణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వేతన జీవులను నిరాశపరిచిన కొత్త బడ్జెట్

**విశాలాంధ్ర – ఆదోని రూరల్:** పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని ఎస్టీయూ రాష్ట్ర మాజీ సోషల్ మీడియా కన్వీనర్,రాష్ట్ర కౌన్సిలర్ జి.వీర చంద్ర యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రకటన ద్వారా మీడియాకు తెలియజేశారు. సిపిఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తుమాట బడ్జెట్ లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్‌కు సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించాల్సి రావడంతో ఉద్యోగుల పాత విధానానికి మొగ్గు చూపుతున్నారని వాపోయారు. ఈసారైనా పాత విధానంలో పన్నులు చెల్లించేసవారికి రాయితీ ఇస్తారని, అందరూ ఆశించిన పాపానికి అడియాశలు అయ్యాయి అన్నారు. నిరాశనే మిగులుస్తూ మరోసారి కొత్త పన్నులు విధానానికి రాయితీలు ప్రకటించడం ఉద్యోగులకు నిరాశ కలిగించిందన్నారు. ఇప్పటికైనా మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరణ చేసే దానిపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాత పన్నుల విధానంలో రూ.7 లక్షల వరకు పన్నులు లేకుండా మినహాయింపు ఇచ్చే విధంగా పన్నులు స్లాబ్ విధానాన్ని సవరించాలని కోరారు. కనీసం లక్ష రూపాయలు స్టాండర్డ్ డిటెక్షన్ మినహాయింపు ఉండాలని పేర్కొన్నారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 6శాతం కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో 3.25శాతం నిధులను కేటాయించారన్నారు.

## నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

**విశాలాంధ్ర – కర్నూలు :** పాత పన్ను విధానంలో కొనసాగుతున్న ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె.జనార్ధన్‌లు ప్రకటనలో పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఆదాయపు పన్ను మినహాయింపు రూ.2.5 లక్షలకే పరిమితమైందని తెలిపారు. ఒకవైపు రూ.8 లక్షల లోపు ఆదాయం కలవారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగానే పరిగణిస్తూ, మరోవైపు రూ.2.5 లక్షల ఆదాయం దాటిన వారి నుండి పన్ను వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. వెంటనే 8 లక్షల వరకు పన్ను మినాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగస్తులు మధ్య తరగతి ప్రజల నుండి ముక్కు పిండి పన్ను వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పన్ను ద్వారా వచ్చే ఆదాయాన్ని కార్పొరేట్ సంస్థలకు, సన్నిహితంగా ఉండే పెద్దలకు దోచిపెడుతుందన్నారు.

## చదువు కోవాలనే అశ ఉంది : బోయ సింధు

**విశాలాంధ్ర –గోనెగండ్ల :** మండలం లోని చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన బోయ సింధు, గ్రామం లో 9వ తరగతి చదువుతోంది. బోయ సింధు వారనికి మూడు రోజులు బడికి, మిగిలిన నాలుగు రోజులకి కూలీ పనికి వెళ్తుంది. బోయ సింధు కుటుంబానికి ఆస్తి లేదు. కూలీ పనిచేసుకొని జీవనం సాగిస్తున్నారు. బోయ పార్వతి, బోయ గోవిందు దంపతులకు ఒక్కటే కూతురు. బోయ సింధు తండ్రి గోవిందు మాట్లాడుతూ తమ దగ్గర చదివించాడానికి ఆర్థిక సోమేత లేక స్థానిక స్కూల్ వదలామని, పూట గడవాలంటే ముగ్గురు కూలీ పని చేసుకోవాల్సిందేనన్నాడు. సంబంధిత అధికారులు స్పందించి తన కూతురు బోయ సింధుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీటు కల్పించి ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు. ప్రభుత్వం బాల కార్మికులతో పని చేయిస్తే నేరమని, బోయ సింధు లాంటి బాలికలు ఎంతో మంది బాలికలు పూట గడవక కూలీ పనికి వెళుతున్నారని, బోయ సింధును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి

**విశాలాంధ్ర – కోడుమూరు:** పట్టణం లోని వెంక టేశ్వర్ నగర్ ప్రాంతంలోని 18, 19, 20 వార్డు ల్లోని డ్రైనేజీ సీసీ రోడ్డు సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు బి.రాజేశ్వరి, స్థానికులు కోరారు. ఈ మేరకు వార్డు సభ్యురాలు బి.రాజేశ్వరి భర్త సిపిఐ నాయకులు బి రాజుతో కలిసి స్థానికులు మంగళవారం మేజర్ గ్రామపంచాయతీ కార్యనిర్వాహణాధికారి ఎం.అజయ్ భాస్కర్‌కు వార్డులలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు బి.రాజు మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితుల కారణంగా వీధులలోని మట్టి రోడ్డుపై నడిచేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాల వల్ల మురికి నీరు ఇళ్లలోకి వస్తుందని, వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. వార్డులలోని సమస్యలు పరిష్కరించేందుకు ఆయా వార్డులలో సీసీ రోడ్డు,డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఈవో దృష్టికి కాలనీలోని సమస్యలను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మధు, వెంకట్, రామాంజనేయులు, సంజన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 25న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

**విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్ :** కర్నూలుజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు జోహరాపురం రోడ్డు మున్సిపల్ టెన్నిస్ కోర్టులో నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ తెలిపారు. ఎంపికైన జట్లు విజయవాడలో ఆగస్ట్ 4, 5 తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి టెన్నిస్, లాంగ్ టెన్నిస్ క్రీడాకారులు 25న ఉదయం 11 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీతో పాటు నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఎంపికల్లో పాల్గొనడానికి 2006 లో జన్మించిన వారు అర్హులన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

**విశాలాంధ్ర – జిల్లా పరిషత్ :** కర్నూలు రూరల్ మండల పరిధిలోని రుద్రవరం దగ్గర సోమవారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తోలుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ ఆదేశాల మేరకు సిబ్బంది పరిశీలించాఋరు. రుద్రవారం 68 సర్వే నంబర్‌లో ఈ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్లు గమనించి, నోటీసులు ఇవ్వడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ విలేకరులకు తెలిపారు. ఈ తనిఖీల్లో కర్నూలు రూరల్ మండలం రెవెన్యూ అధికారులు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**విశాలాంధ్ర – ఆస్పరి:** వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ వినియోగదారులను విద్యుత్ శాఖ ఏఈ మల్లికార్జున కోరారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు, ప్రజలు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రమాదాలను నివారిద్దామని, భారీ వర్షాలు, గాలులు ఉన్నపుడు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ సమయంలో గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్‌మోడ్‌లోనే, కరెంటు బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంబాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదని, ఇంటి పరిసరాలలో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతర ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించరాదని తెలిపారు. గాలి వాన సమయంలో కరెంటు లైన్ కింద ఉండరాదని సూచించారు.మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునిగినా, పూర్తిగా తడిసినా షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులు తమ భవనాల అంతర్గత వైరింగ్‌కు నాణ్యత కలిగిన విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, పరికరాల్ని వాడడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఇళ్లలోని స్విచ్ బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో అమర్చుకోవాలని, తప్పనిసరిగా ఎర్త్ పైప్ ద్వారా ఎర్తింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల్ని అరికట్టవచ్చన్నారు. డాబాలపైన దుస్తులు ఆరవేసేటప్పుడు, ఇళ్ల నిర్మాణ ప్రాంతాల్లో సమీపాన విద్యుత్ వైర్లు ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912కు తెలియజేయాలన్నారు.

## ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు : ట్రాఫిక్ సీఐ

**విశాలాంధ్ర – కర్నూలు క్రైం:** రోడ్డుపై వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ కు ఇబ్బందులు కల్పిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరించారు. ప్రజల ఫిర్యాదు మేరకు కర్నూలు ట్రాఫిక్ సిఐ పి.గౌతమి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రాజవిహార్ నుండి గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా సీ క్యాంపు వరకు రోడ్డు మీద ఉన్న పండ్ల బండ్లను, టిఫిన్ బండ్లను, బజ్జీల బండ్లను, మొబైల్ క్యాంటీన్లను, రోడ్డు మీద పెట్టి వ్యాపారాలు చేసే వారిపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు మీద వ్యాపారాలు చేస్తున్న వారిపై పెట్టి కేసులను నమోదు చేసి, వారిని కోర్టులో హాజరు పరిచినట్లు కర్నూలు ట్రాఫిక్ సీఐ పి.గౌతమి తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

# సంక్షిప్త సమాచారం

### నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ..

**విశాలాంధ్ర– కర్నూలు సిటీ :** నగరపాలక సంస్థ స్థాయీ సంఘం కమిటీ సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. మంగళవారం మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. 31వ వార్డు కార్పొరేటర్ మిద్దె చిట్టమ్మ, 3వ వార్డు కార్పొరేటర్ షేక్ షాజహాన్ పర్వీన్, 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహ్మద్ తమ నామినేషన్ల పత్రాలను అందజేశారు. ఇప్పటికి నామినేషన్ల దాఖలు చేసిన వారి సంఖ్య 12కు చేరింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణ ముగుస్తుంది. అనంతరం అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. గురువారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సెక్రటరీ చిన్నరాముడు, క్లర్క్ జిఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

### శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు..

**విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు :** శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. అధికారులు తెలిపిన వివరాల మేరకు 1లక్ష 49వేల 647 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు ఉండగా ప్రస్తుతం 838.90 అడుగులు ఎత్తుకు నీళ్లు చేరాయి. డ్యామ్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 60.2171 టీఎంసీలు నీరు నిలువ ఉన్నట్లు అధికారి తెలిపారు. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రలలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు.

### జిల్లా టీడీపీ అధిష్టానం ఆలూరుపై దృష్టి పెట్టాలి..

**విశాలాంధ్ర – దేవనకొండ రూరల్:** ఆలూరు నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, ఆలూరు నియోజకవర్గంపై జిల్లా టిడిపి అధిష్టానం దృష్టి పెట్టాలని కర్నూలు టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి రాందాస్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమేనని, ఆలూరులో టిడిపి ఓటమి చెందడానికి నాయకులను, కార్యకర్తలను బాధ్యులను చేయడం తగదని అన్నారు. నియోజకవర్గంలో ఎవరు ఇన్చార్జి ఉన్న అందరూ కలిసికట్టుతో ముందుకు వెళ్లాలని కోరారు.

### కేంద్ర బడ్జెట్ అంకెల గారడి బడ్జెట్..

**విశాలాంధ్ర – జిల్లా పరిషత్ :** బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి బడ్జెట్ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు విమర్శించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇది బడ్జెట్ కాదని, ఎన్నికల మ్యానిఫెస్టోలా ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులక్ష కోట్లు కావాలని అడిగారని, కానీ ఏపికి దాదాపు 12 లక్షల కోట్లు కావాల్సి ఉందని, 5 ఏళ్లకు 5 లక్షల కోట్లు ఎలా సరిపోతాయని బాబురావు ప్రశ్నించారు. బడ్జెట్‌లో కేవలం రాజధానికి నిధులు ఇస్తామని చెప్పారు. పోలవరం మీద ఎన్నో కబుర్లు చెప్పారని లైఫ్ లైన్ అన్నారు. పార్లమెంట్ వేదికగా ఇక హోదా లేదని తేలిపోయిందని, ప్రత్యేక ప్యాకేజీలు అంటున్నారు కానీ హోదా మీద చెప్పడం లేదన్నారు. ఈ బడ్జెట్ హర్షించేది కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కళ్ళు తెరవాలని, బిజెపితో మద్దతు ఉపసంహరించుకోండని డిసిసి అధ్యక్షులు హితవు పలికారు.

### ఉత్సాహంగా శిక్ష సప్తహ కార్యక్రమం..

**విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్ :** కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సామ్యూల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విధానం ప్రవేశపెట్టిన నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29 వరకు వారం రోజులపాటు జిల్లాలోని ఎన్ని పాఠశాలలో కార్య క్రమాన్ని నిర్వహించాలని వారు అధికారులకు సూచించారు. పునాది అభ్యసనం, సంఖ్యా శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయ వంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు అవగాహన కల్పించడం కొరకు పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అన్నారు. ఇందులో భాగంగా డైట్ ప్రిన్సిపాల్ వసుంధర దేవి, డైట్ ఉపాధ్యాయులు సమగ్ర శిక్షణ సహాయక పర్యవేక్షణ అధికారి డాక్టర్ రఫీ, జిల్లా కోఆర్డినేటర్ దావీదు పాల్గొన్నారు.

### కౌలు రైతు హక్కు పత్రాలు గుర్తించి ఇవ్వండి..

**విశాలాంధ్ర –హొళగుంద:** మండలంలోని కౌలు సాగుదారు రైతులకు అక్కుపత్రాలను గుర్తించి ఇవ్వండని డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్ కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఏఏలు, వీఆర్వోలు, ఎంపీఈవోల సమావేశం జరిగింది. మండలంలో గతంలో 702 కౌలు హక్కు పత్రాలు పంపిణీ చేశామని, ఈ ఏడాది 1365 కౌలు రైతు హక్కు పత్రాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతుల హక్కు పత్రాల వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్ దళ్ మాట్లాడుతూ వీఏలు, వీఆర్వోలు, ఎంపీఈవోలు తమకు కేటాయించిన పనిని బాధ్యతగా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన కౌలు హక్కు పత్రాల పంపిణీ అందరూ పూర్తి చేయాలన్నారు. మండలంలోని ఏ ఒక్క కౌలు రైతు నిర్లక్ష్యానికి గురి కాకూడదని ఎవరైనా తప్పిపోతే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈఓ విరుపాక్షి, ఆర్ఐ దినోజ్ కుమార్ వీఆర్ఏలు నాగరాజ్, సతీష్, వీరేష్, దామోదర, హనుమంతు, సురాంజనేయ, లక్ష్మీనారాయణ రెడ్డి, వీఏఏలు మణి శ్రీ, సుంకమ్మ, తస్లీమా, నాయక్, ఎంపీఈవోలు అంజి, నరసింహులు, ఉత్తరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎల్సీ కాల్వ వ్యర్థ పదార్థాలను తొలగించాలి : సీపీఐ

**విశాలాంధ్ర – ఎమ్మిగనూరు :** పట్టణ సమీపంలో ఉన్న ఎల్ఎల్సీ కాలువలో పడి ఉన్నా విష, వ్యర్థ పదార్థాలను తొలగించి పట్టణంలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, జిల్లా సమితి సభ్యులు బి.టి చిన్నాన్న వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసిన నేపథ్యంలో ఎల్ఎల్సీ కాలువకు వస్తున్న సందర్భంగా తక్షణమే ఆ కాలువలో ఉన్న వ్యర్థ పదార్థాలు తొలగించాలని అనేక దఫాలుగా సీపీఐగా అనేక పోరాటాలు చేసిన ఎల్ఎల్సి అధికారులు, మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎల్ ఎల్ సి కాలువ ద్వారా వచ్చే నీరును పట్టణ ప్రజల తాగునీరు ఉపయోగి స్తారని, తక్షణమే తొలగించాలన్నారు.. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేసీ జబ్బర్, తిమ్మ గురుడు, వీరేష్, విజేంద్ర, మల్లికార్జున్ గౌడ్, కాజా, రవి, ఖాదర్, నరసింహు లు, ఎల్లప్ప, సమీర్, ఇస్మాయిల్, పాల్గొన్నారు.

**ఎల్ఎల్సీ కాలంలో వ్యక్తపదార్థాలను తొలగింపు :** ఎల్ఎల్సీ కాలువలో పడి ఉన్న వ్యర్థా విష పదార్థాలను తొలగించాలని అనేక దఫాలుగా సీపీఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలకు స్పందించి, మున్సిపల్ అధికారులు తొలగించినందుకు సీపీఐ నాయకులు మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

**విశాలాంధ్ర – క్రిష్ణగిరి:** మండల పరిధిలోని అమకతాడు గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అమకతాడు సుధాకర్, కర్లకుంట రామకృష్ణ పుట్లూరు మహేంద్ర, లోకేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలపై సచివాలయానికి వెళ్తే సమయానికి ఎవరు ఉండరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజు దాదాపు 11:40 నిమిషాల సమయమైనా విధులకు రావడంలేదని, వారు ఇష్ట రాజ్యాంగ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని వారన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, ఒకరు వస్తే మరొకరు రారు, ఎందుకు రాలేదని అడిగితే వేరే పని మీద వెళ్లాడని చెప్పడం, సచివాలయానికి ఎప్పుడు తాళం వేసి ఉండడం ఇవన్నీ వారికి అలవాటుగా మారాయి అన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటికి సరైన సమాధానం చెప్పరని వారు ఆరోపించారు. ప్రతినెల వేలరూపాయలు జీతాలు తీసుకుంటూ బాధ్యతలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారన్నారు. ప్రజలు సచివాలయానికి వచ్చి ఏదైనా సమస్యలు అడుగుతే పొంతన లేని సమాధానం చెప్తారని వారు అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రవర్తించినట్టే సచివాలయ ఉద్యోగస్తుల వ్యవహార శైలి ఇంకా మారలేదని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు సచివాలయ ఉద్యోగులపై దృష్టి సారించి ప్రజల సమస్యలపై స్పందించే విధంగా వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

## గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలి

**విశాలాంధ్ర – జిల్లా పరిషత్:** ఆదోని నియోజకవర్గం నాగనాథ హల్లి గ్రామంలో జరిగిన గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబు రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి నూతన ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి వినతిపత్రం సమర్పించారు. బాబురావు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఆదోని నియోజకవర్గం నాగనాథహల్లి గ్రామంలో దళిత మహిళ అయిన గుండమ్మను భూతగాదాల కారణంగా ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నాగనాథ హల్లి గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగినదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన 50 రోజులకే రాష్ట్రంలో హత్య రాజకీయాలు ఎక్కువయ్యాయని, గుండమ్మ కుటుంబంపై అగ్రవర్ణ వ్యక్తుల దాడి చేస్తే ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని, పొలం తగాదాలో పెద్దల సమక్షంలో మాట్లాడితే సరిపోయేదాన్ని ఇలా హత్యలు చేసేదాక రావడం తగదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధిత కుటుంబాన్ని కలిసి వారికి ప్రభుత్వంచే రావలసిన నష్ట పరిహారాన్ని సత్వరమే మంజూరయ్యేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, డిసిసి కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రూ.77 కోట్లు నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర – ఆదోని :** ఇంటింటి కోలాయి జలజీవన్ పథకం క్రింద ఆదోని అసెంబ్లీ పరిధిలోని గ్రామాల్లో శుద్ధమైన త్రాగునీటి సరఫరా కొరకు రూ.77 కోట్లు నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరడం జరిగిందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. మంగళవారం అసెంబ్లీ సెషన్స్ విరామ సమయంలో పవన్ కళ్యాణ్ కలిసి ఇంటింటి కోళ్ళాయి పథకంకు సంబంధించిన టెండర్లను పిలవాల్సిన నివేదికను సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని అసెంబ్లీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి ఎద్దడి అధికంగా ఉందని గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ప్రాంతంలో ఇంటిం టి కోళ్ళాయి పథకాన్ని అమలు చేయలేక పోయారని మంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఆ గ్రామాల్లో నీటి సరఫరా కోసం రూ.77 కోట్లతో అంచనాలను గత అధికారులు తయారు చేసినప్పటికి, అప్పటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు నీటిని అందించలేక పోయారన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నీళ్లు అందించేందుకు కృషి చేయాలన్ని కోరారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గల గ్రామీణ రోడ్ల ఏర్పాటు, మరమ్మతులకు రూ.13 కోట్లు మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఆదోని మండల పరిధిలోని గ్రామ పంచాయతీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన సమర్పించి రోడ్ల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. మంత్రి పవన్ కళ్యాణ్ అందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వాటితో పాటు మండలంలో నీటి సరఫరా కొరకు 250 బోర్ వెల్స్ వేయడంపై ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. మండల పరిధిలోని బసాపురం గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో ఎస్ ఎస్ ట్యాంక్ నిర్మాణం కొరకు రూ. 2 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదోని సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ప్రజలు చర్చించు కుంటున్నారు.

## చురుగ్గా సాగుతున్న మార్లమడికి రోడ్డు

**విశాలాంధ్ర – హొళగుంద :** మండల పరిధిలోని మార్లమడికి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఎన్నికల ముందు ఐదు కోట్ల 34 లక్షల రూపాయలు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో పోటా పోటీగా మాజీ కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ప్రస్తుత ఎమ్మెల్యే డి.విరుపాక్షి వేరువేరుగా భూమి పూజ చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డు పనులు చేయాల్సి ఉండగా అధికారులు రెండున్నర కిలోమీటర్ వరకు కొత్త బీటీ రోడ్డును వేశారు. కొత్త బీటీ రోడ్డు సగానికి పూర్తి కాకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మిగిలిన రెండు కిలోమీటర్ వరకు ఉన్న రోడ్డుకు అధికారులు గరుసు మట్టిని వేసి రోలర్ తిప్పి వదిలివేశారు. మార్లమడకి, హెబ్బన్నూరు, హెబ్బ న్నూరు కొట్టాల, ముద్దటమాగి గ్రామాలకు రోజు వెళ్లే వారి ప్రజలకు కొత్త రోడ్డు వేయడం వల్ల ప్రయాణికులకు సుఖాంతమైంది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయుడు కొత్త బస్సు సర్వీసును ప్రారంభించి ప్రజలకు విద్యార్థులకు ఎంతో మేలు కలిగించారు .కొత్త బస్సు సర్వీసు ప్రారంభించడం పట్ల గ్రామస్తులు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్, ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ కు, ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వీరభద్రగౌడ్‌కు తప్ప ఏవరికైనా ఇవ్వండి

**విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు :** ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తనకే ఇవ్వాలని టీడీపీ నేత వీరభద్రగౌడ్ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరభద్రగౌడ్‌కు తప్ప ఎవరికి ఇచ్చినా కలసి పని చేసుకుంటామని మరికొందరు నేతలు టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డిని కలసి వినతిపత్రం అందచేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు టీడీపీ సీటు చంద్రబాబునాయుడు సీనియర్‌లను కాదని 2014లో ఓటమి చెందిన వీరభద్రగౌడ్‌కు కేటాయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో ఉన్న 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు సీట్లకు టీడీపీ రెండు పార్లమెంట్, 12 అసెంబ్లీ సీట్లలో విజయకేతనం ఎగుర వేసింది. కర్నూలు జిల్లాలోని ఆలూరు, మంత్రాలయంలో ఓటమి పాలైంది. ఆలూరు సీటును స్వల్పఓట్ల తేడాతోనే ఓటమి చెందడం టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకున్నారు. ఓటమికి ప్రదాన కారణం అభ్యర్థి సీనియర్‌ల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం, కలుపుకొని పోకపోవడమే కారణమంటున్నారు. కలసి కట్టుగా పనిచేసి ఉంటే ఆలూరులో టీడీపీ జెండా ఎగుర డం ఖయమని నాయకులు అంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నేతలు సుమారు 30 వాహనాల్లో కర్నూలు జిల్లాకార్యాలంకు వచ్చి జిల్లా అధ్యక్షున్ని కలసి వీరభద్రగౌడ్‌కు ఇస్తే ఒప్పుకేనేది లేదని, నియోజకవర్గలో ఎవరికి ఇచ్చిన అందరం కలసి కట్టుగా పనిచేస్తామని తెలియచేశారు. ఆలూరు నియోజకవర్గం లో బీసీలు అధికంగా ఉండటంతో బీసీ నేతలు అనేక మంది ఇన్‌చార్జి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆలూరు ఇన్‌చార్జి పదవిమాజీ మంత్రి కేఈ ప్రభాకర్, సీనియర్ నాయకులు మీనాక్షినాయుడు లేదా బీసీలకు ఎవరికి ఇచ్చినా సహకరించి గెలిపించుకుంటా మని గౌడ్ వ్యతిరేఖ వర్గం అంటుంది. అదిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వేచి చూడాల్సిందే.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 24, జూలై 2024



# పత్తి పంటను పరిశీలించిన డీఏవో

**విశాలాంధ్ర -గోనెగండ్ల :** మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో మంగళవారం పత్తి పంటను డీఏఓ.పీఎల్.వరలక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ పీఎల్ వరలక్ష్మీ మాట్లాడుతూ కౌలు చేస్తున్న రైతులందరు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని, దీనివల్ల యాజమానులకుకు ఎటువంటి నష్టం ఉండదని, కౌలు కార్డు కేవలం 11 నెలలు మాత్రమే గడువు ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో సాగుచేసిన కొర్ర,పత్తి,కంది పంటలను పరిశీలించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు జిగురు అట్టలు ఎకరానికి 30 అమర్చుకోవాలని తెలిపారు. మొదటి విడతలో వేపనూనె పిచికారి చేసుకోవాలని తెలిపారు. కంది పంటను కూడా పరిశీలించారు. కంది పంటలో నువ్వులు మిశ్రమ పంటగా సాగు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల మండల వ్యవసాయ అధికారిని హేమలత, గ్రామ వ్యవసాయ సహాయకులు అబ్దుల్ సత్తార్, గ్రామ ఉద్యానవన సహాయకులు జాకీర్, రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదు

- మరో నెల దాకా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలి
- తాగునీటికి క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలి
- గ్రామాల వారీగా తాగునీటి సమస్యలపై సమగ్రమైన నివేదిక అందించా

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:** వర్షాకాలం ముగిసేంతవరకు దాదాపు మరో నెల దాకా జిల్లాలో శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో శానిటేషన్ డ్రైవ్‌పై టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు షెడ్యూల్ ప్రకారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడ తాగు నీటి సమస్య తలెత్తకూడదని, తాగునీటిని సరఫరా చేయడంతో పాటు, అన్ని గ్రామాలకు నీటి పథకాల ద్వారా నీరు సక్రమంగా పంపిణీ అవుతోందా, లేదా అని పర్యవేక్షించాలని కలెక్టర్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. తాగునీటికి క్లోరినేషన్ పరీక్షలు చేయించాలని, డ్రైనేజ్ క్లీనింగ్,ఫాగింగ్, ఇతర పారిశుధ్య కార్యక్రమాలను తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలం ముగిసేంతవరకు మరో నెల పాటు ఈ కార్యక్రమాలన్నీ చేపట్టాలని, అప్పుడే గ్రామాల్లో డెంగ్యూ, డయేరియా వంటి అంటువ్యాధులను కంట్రోల్ చేయగలమని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా పరిశీలనలోకి వచ్చిన అంశాలు, తాగునీటి సమస్యలు ఏమున్నాయి, నిధులు అవసరం వంటి వివరాలతో సమగ్ర నివేదికను తనకు అందించాలని సంబంధిత శాఖల అధికారులు,స్పెషల్ ఆఫీసర్లు,సబ్ కలెక్టర్, ఆర్డిఓ లను కలెక్టర్ ఆదేశించారు. గూడూరు, గోనెగండ్ల, కోడుమూరు, కౌతాళం తదితర మండలాల్లో శానిటేషన్ డ్రైవ్ సరిగా జరగడం లేదని, సంబంధిత మండలాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శానిటేషన్ డ్రైవ్ ను తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.. ఎల్ ఎల్ సి నుంచి నీరు వస్తున్నందున, ఆ నీటిని ముందుగా తాగునీటి స్టోరేజ్ ట్యాంక్స్‌లో నింపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి స్టేటస్ రిపోర్టును రోజు తన పంపించాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. ఎల్ఎల్‌సి నుండి వచ్చే నీరు ఫ్రెష్ వాటర్ అయినందున కలుషితం అయి ఉండవచ్చని, ఈ నీటిని క్లోరినేషన్ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, స్కీమ్స్‌కు ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, డిపిఓలను కలెక్టర్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిపిఓ నాగరాజు నాయుడు, జడ్పి సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు వివరించాలి

**విశాలాంధ్ర - బనగానపల్లె:** విద్యార్థులకు చెడు వ్యసనాలల్ల కలిగే అనర్థాలను తెలియ జేయాలని సీఐ గంట సుబ్బారావు సూచించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ నందు పట్టణ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళ సంరక్షణ కార్యదర్శి వారి పరిదిలోని స్కూల్‌లకు వెళ్లి విద్యార్థులతో గుట్కా, మద్యం, మత్తు పదార్థాలు తీసుకోవడం, విద్యార్థుల ర్యాగింగ్, బాలికలపై జరిగే అత్యాచారాలపై చెడు వ్యసనాలపై దూరంగా ఉండే విధంగా అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాల గురించి ముందస్తు సమాచారం సేకరించే సూచనలు గురించి వివరించడం జరిగింది.

## స్టాప్ డయేరియాపై అవగాహన

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలం లోని మూడు రాళ్ళపల్లెలో స్టాప్ డయేరియాపై ముత్యాల పాడు వైద్యాధికారి తస్లీమా సుల్తానా ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వలన డయేరియా, అతసార వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం వున్నందున ప్రతిఒక్కరు కాచి చల్లారిన నీటిని త్రాగాలన్నారు. చేతులు పరిశుభ్రంగా సబ్బునీటితో శుభ్రపరచుకొని , వేడివేడి ఆహార పదార్థములను భుజించాలన్నారు. డయేరియా వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా ఓఆర్ఎస్, జింక్ మాత్రలు వాడడం ద్వారా తీవ్రత తగ్గించడం ద్వారా ప్రాణాపాయం జరగకుండా కాపాడవచ్చన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమమలో ఆరోగ్యవిస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, సిహెచ్ఓ చంద్రకళ, ఏఎన్ఎం వేదమణి,హెల్త్ అసిస్టెంట్ మనోహర్, అంగవాడి కార్యకర్త శోభ, ఆశాకార్యకర్త వరలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాలగంగాధర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

**విశాలాంధ్ర -పత్తికొండ:** స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి తెలిపారు. మంగళవారం ఏబీవీపీ పత్తికొండ నూతన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసిన పుణ్యమూర్తులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ అని కొనియాడారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏబీవీపీ పట్టణ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. పట్టణ కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులుగా దేవనాద్, చరణ్, కళ్యాణ్‌తో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు..

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. అధికారులు తెలిపిన వివరాల మేరకు 1లక్ష 49వేల 647 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు ఉండగా ప్రస్తుతం 838.90 అడుగులు ఎత్తుకు నీళ్లు చేరాయి. డ్యామ్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 60.2171 టీఎంసీలు నీరు నిలువ ఉన్నట్లు అధికారి తెలిపారు. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రలలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు.

## జిల్లా టీడీపీ అధిష్టానం ఆలూరుపై దృష్టి పెట్టాలి..

**విశాలాంధ్ర - దేవనకొండ రూరల్:** ఆలూరు నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, ఆలూరు నియోజకవర్గంపై జిల్లా టిడిపి అధిష్టానం దృష్టి పెట్టాలని కర్నూలు టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి రాందాస్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమేనని, ఆలూరులో టిడిపి ఓటమి చెందడానికి నాయకులను, కార్యకర్తలను బాధ్యులను చేయడం తగదని అన్నారు. నియోజకవర్గంలో ఎవరు ఇన్చార్జి ఉన్న అందరూ కలిసికట్టుతో ముందుకు వెళ్లాలని కోరారు.

## కేంద్ర బడ్జెట్ అంకెల గారడి బడ్జెట్..

**విశాలాంధ్ర - జిల్లా పరిషత్ :** బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి బడ్జెట్ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు విమర్శించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇది బడ్జెట్ కాదని, ఎన్నికల మ్యానిఫెస్టోలా ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులక్ష కోట్లు కావాలని అడిగారని, కానీ ఏపికి దాదాపు 12 లక్షల కోట్లు కావాల్సి ఉందని, 5 ఏళ్లకు 5 లక్షల కోట్లు ఎలా సరిపోతాయని బాబురావు ప్రశ్నించారు.

## ఉత్సాహంగా శిక్ష సప్తహ కార్యక్రమం..

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ :** కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సామ్యూల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విధానం ప్రవేశపెట్టిన నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29 వరకు వారం రోజులపాటు జిల్లాలోని ఎన్ని పాఠశాలలో కార్య క్రమాన్ని నిర్వహించాలని వారు అధికారులకు సూచించారు. పునాది అభ్యసనం, సంఖ్యా శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు అవగాహన కల్పించడం కొరకు పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది అన్నారు.

# ఎల్ఎల్సీ కాల్వ వ్యర్థ పదార్థాలను తొలగించాలి : సీపీఐ

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు :** పట్టణ సమీపంలో ఉన్న ఎల్ఎల్సీ కాలువలో పడి ఉన్నా విష, వ్యర్థ పదార్థాలను తొలగించి పట్టణంలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, జిల్లా సమితి సభ్యులు బి.టి చిన్నాన్న వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసిన నేపథ్యంలో ఎల్ఎల్సీ కాలువకు వస్తున్న సందర్భంగా తక్షణమే ఆ కాలువలో ఉన్న వ్యర్థ పదార్థాలు తొలగించాలని అనేక దఫాలుగా సీపీఐగా అనేక పోరాటాలు చేసిన ఎల్ఎల్సి అధికారులు, మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఎల్ ఎల్ సి కాలువ ద్వారా వచ్చే నీరును పట్టణ ప్రజల తాగునీరు ఉపయోగి స్తారని, తక్షణమే తొలగించాలన్నారు.. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేసీ జబ్బర్, తిమ్మ గురుడు, వీరేష్, విజేంద్ర, మల్లికార్జున్ గౌడ్, కాజా, రవి, ఖాదర్, నరసింహు లు, ఎల్లప్ప, సమీర్, ఇస్మాయిల్, పాల్గొన్నారు.

**ఎల్ఎల్సీ కాలంలో వ్యక్తపదార్థాలను తొలగింపు :** ఎల్ఎల్సీ కాలువలో పడి ఉన్న వ్యర్థా విష పదార్థాలను తొలగించాలని అనేక దఫాలుగా సీపీఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలకు స్పందించి, మున్సివల్ అధికారులు తొలగించినందుకు సీపీఐ నాయకులు మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

**విశాలాంధ్ర - క్రిష్ణగిరి:** మండల పరిధిలోని అమకతాడు గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అమకతాడు సుధాకర్, కర్లకుంట రామకృష్ణ పుట్లూరు మహేంద్ర, లోకేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలపై సచివాలయానికి వెళ్తే సమయానికి ఎవరు ఉండరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజు దాదాపు 11:40 నిమిషాల సమయమైనా విధులకు రావడంలేదని, వారు ఇష్ట రాజ్యాంగ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని వారన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, ఒకరు వస్తే మరొకరు రారు, ఎందుకు రాలేదని అడిగితే వేరే పని మీద వెళ్లాడని చెప్పడం, సచివాలయానికి ఎప్పుడు తాళం వేసి ఉండడం ఇవన్నీ వారికి అలవాటుగా మారాయి అన్నారు. ప్రజల సమస్యలు పట్టించు కోవడంలేదని ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటికి సరైన సమాధానం చెప్పరని వారు ఆరోపించారు. ప్రతినెల వేలరూపాయలు జీతాలు తీసుకుంటూ బాధ్యతలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారన్నారు. ప్రజలు సచివాలయానికి వచ్చి ఏదైనా సమస్యలు అడుగుతే పొంతన లేని సమాధానం చెప్తారని వారు అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రవర్తించినట్టే సచివాలయ ఉద్యోగస్తుల వ్యవహార శైలి ఇంకా మారలేదని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు సచివాలయ ఉద్యోగులపై దృష్టి సారించి ప్రజల సమస్యలపై స్పందించే విధంగా వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

## గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలి

**విశాలాంధ్ర - జిల్లా పరిషత్:** ఆదోని నియోజకవర్గం నాగనాథ హల్లి గ్రామంలో జరిగిన గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబు రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి నూతన ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి వినతిపత్రం సమర్పించారు. బాబురావు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఆదోని నియోజకవర్గం నాగనాథహల్లి గ్రామంలో దళిత మహిళ అయిన గుండమ్మను భూతగాదాల కారణంగా ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నాగనాథ హల్లి గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగినదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన 50 రోజులకే రాష్ట్రంలో హత్య రాజకీయాలు ఎక్కువయ్యాయని, గుండమ్మ కుటుంబంపై అగ్రవర్ణ వ్యక్తుల దాడి చేస్తే ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని, పొలం తగాదాలో పెద్దల సమక్షంలో మాట్లాడితే సరిపోయేదాన్ని ఇలా హత్యలు చేసేదాక రావడం తగదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధిత కుటుంబాన్ని కలిసి వారికి ప్రభుత్వంచే రావలసిన నష్ట పరిహారాన్ని సత్వరమే మంజూరయ్యేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, డిసిసి కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలి

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్ ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి, తాపీ వర్కర్స్ యూనియన్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణం నందు స్థానిక తాపీ వర్కర్స్ యూనియన్ ఎస్ రహమతుల్లా అధ్యక్షతన పగిడ్యాల రోడ్డు నందు ఉన్న మహమ్మదీయ షాది ఖానా నందు జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రఘురాంమూర్తి మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 2019లో మాజీ స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సంక్షేమ బోర్డు నందు రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు నందు నాలుగు లక్షల మంది సభ్యులుగా చేరడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికులకు ఏడు రకాల పరిహారం రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చేవారని, అయితే వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రూ.18 వందలకోట్లు నవరత్నాల సంక్షేమ పథకాల మళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 వేలమంది కార్మికులు సంక్షేమ బోర్డుకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాలలో ఒక్కరికి పరిహారం ఇవ్వలేదని వారన్నారు. ఇప్పుడు ఏర్పడిన నూతన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని, 32 వేల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి పరిహారం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాపీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు జిఎం నూర్ అహ్మద్, బి.అయూబ్, ఎస్.కాజా హుస్సేన్, ఎస్.వలి, ఎస్.జిలాని, ఏఐఎస్ఎఫ్ తాలూకా నాయకులు మహానంది, వినోద్‌లు తదితరులు పాల్గొన్నారు.

## దొంగల బెడదతో రైతుల ఆందోళన

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** పంటలు సాగు చేస్తున్న రైతన్నలు దొంగల బెడతతో ఆందోళన చెందుతున్నారు. రాత్రిల్లు వ్యవసాయ బోర్లాకు అమర్చిన విలువైన రాగి వైర్‌ను గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడుతున్నడంతో కలవరం చెందుతున్నారు. మండలంలోని మదనంత పురం గ్రామ పరిధిలో పలువురి రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న రాగి వైరును గుర్తుతెలియని దొంగలు సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం బోర్ల వద్దకు వెళ్లిన రైతులకు చోరీ విషయం బయటపడింది. గ్రామానికి చెందిన గంగరాజు, ప్రతాప్ రెడ్డి, సాకం సుంకిరెడ్డి, చెక్క రామాంజనేయులు, యాతం శివ నారా యణ రెడ్డి, కృష్ణారెడ్డి తదితర రైతులకు చెందిన 12 వ్యవ సాయ బోర్లకు ఉన్న విలువైన రాగి వైర్‌ను దుండగులు ఎత్తు కెళ్లారు. దొంగల బెడద రోజురోజుకు ఎక్కువ అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్టార్టర్ బాక్స్ నుండి బోరు బావి మోటర్కు అమర్చిన రాగి వైర్‌ను దుండగులు కట్ చేసి పట్టుకెళ్ళారు. ఒకొక్క బోర్ బావి వద్ద నుండి తీసుకువెళ్లిన రాగి వైర్ విలువ దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుందని రైతులుతెలిపారు. అంతే కాక కొత్త వైర్‌ను అమర్చుకోవాలంటే బోరు బావిలోని పైపులను వెలికి తీసే వాహనాన్ని బాడుగకు పిలుచుకోవలసి వస్తుందని వాపోయారు. బాధిత రైతులు స్థానిక పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. చోరీకి పాల్పడు తున్న దొంగలను పట్టుకొని న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## చురుగ్గా సాగుతున్న మార్లమడికి రోడ్డు

**విశాలాంధ్ర - హొళగుంద :** మండల పరిధిలోని మార్లమడికి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉండడం తో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరా యం ఏర్పడు తుంది. ఎన్నికల ముందు ఐదు కోట్ల 34 లక్షల రూపాయలు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూర య్యాయి. అప్పట్లో పోటా పోటీగా మాజీ కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ప్రస్తుత ఎమ్మెల్యే డి.విరుపాక్షి వేరువేరుగా భూమి పూజ చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డు పనులు చేయాల్సి ఉండగా అధికారులు రెండున్నర కిలోమీటర్ వరకు కొత్త బీటీ రోడ్డును వేశారు. కొత్త బీటీ రోడ్డు సగానికి పూర్తి కాకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మిగిలిన రెండు కిలోమీటర్ వరకు ఉన్న రోడ్డుకు అధికారులు గరుసు మట్టిని వేసి రోలర్ తిప్పి వదిలివేశారు. మార్లమడకి, హెబ్బాన్నూరు, హెబ్బ న్నూరు కొట్టాల, ముద్దటమాగి గ్రామాలకు రోజు వెళ్లే వారి ప్రజలకు కొత్త రోడ్డు వేయడం వల్ల ప్రయాణికులకు సుఖాంతమైంది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయుడు కొత్త బస్సు సర్వీసును ప్రారంభించి ప్రజలకు విద్యార్థులకు ఎంతో మేలు కలిగించారు .కొత్త బస్సు సర్వీసు ప్రారంభించడం పట్ల గ్రామస్తులు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్, ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ కు, ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలకు టైలరింగ్ పై ఉచిత శిక్షణ..

**విశాలాంధ్ర - బనగానపల్లె:** యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం, ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు టైలరింగ్, డిసైన్ బ్లౌజుల, జ్యూట్ బ్యాగుల తయారీపై రెండు నెలల ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళలు, యువతులు ఈ నెల 31లోగా ఈ నంబర్‌ను 9441192765 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవలసినదిగా తెలపడమైనది.

## పైరులో పురుగుల నివారణ చర్యలు

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల :** పట్టణంలో మంగళవారం వ్యవసాయ అధికారి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వ్యవసాయ అధికారి నిరంజన్ మాట్లాడుతూ అధిక వర్షాల వలన సూక్ష్మధాతూ పోషకాలు ముఖ్యంగా ఐరన్ లోపం వలన ఆకులు పసుపు రంగులోకి మారుతాయన్నారు. దీని నివారణకు అన్నభేది ఫెర్రస్ సల్ఫేట్ 5 నుంచి 8 గ్రాములు లీటర్ నీటికి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటర్ నీటికి కలిపి క్లోరోఫైరి పాస్-2 ఎంఎల్,లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాల న్నారు. సూక్ష్మ ధాతు పోషక లోపాలను, ఆకులను నాశించు చిత్తపురుగులు రసం పీల్చే, పురుగులను నివారించుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారి నిరంజన్ తెలిపారు.

## ప్రజా అవసరాల కోసం నూతన బ్రిడ్జి ..

**విశాలాంధ్ర - బనగానపల్లె:** ప్రజా అవసరాల కోసం బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి తెలిపారు. మండలం లోని యాగంటి పల్లె గ్రామంలో బ్రిడ్జి పనులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు వేగవంతంగా నాణ్యతతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి..

**విశాలాంధ్ర - పాములపాడు :** మండలంలోని, మిట్టకందాల గ్రామంలో మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్ ను పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు మాదిగ ఎంపీడీవో వి.సరస్వతికీ మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ హాయంలో మిట్ట కందల గ్రామంలో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి, వాటర్ ప్లాంట్ నిర్మించి ప్రజలకు మంచినీటి సరఫరా అందించాలని కోరారు. మలేరియా డెంగ్యూ అతిసార వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అనారోగ్యాల నుండి కాపాడారాని ఆయన అన్నారు. ప్రతిరోజు మిట్టకందాల గ్రామ ప్రజలు శుద్ధ జలాల కోసం మండల కేంద్రమైన పాములపాడు మండలానికి రావాల్సి వస్తుందని, ఈ వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను మళ్ళీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించండి..

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల :** మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా డిస్టిక్ కోఆర్డినేటర్ అధికారి జఫ్రుల్లా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన అన్నారు. ఆసుపత్రులను రోగులతో మాట్లా డుతూ వైద్య సేవలు వివరాలపై ఆరా తీశారు. వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచిం చారు. సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన కూలీలకు పరామర్శ..

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామంలో సోమవారం పురుగుమందు ప్రభావంతో 20 మందికి పైగా కూలీలు అస్వస్థతకు గురై కొందరు నంద్యాల ఆసుపత్రిలో, కొందరు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పురుగు మందు ప్రభావంతోనే వారు అస్వస్థతకు గురికావడం జరిగిందన్నారు. ప్రస్తుతం నంద్యాలలో చికిత్స పొందు తున్న వారంతా కోలుకున్నారని, మంగళవారం డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

## కౌలు రైతు హక్కు పత్రాలు గుర్తించి ఇవ్వండి..

**విశాలాంధ్ర -హొళగుంద:** మండలంలోని కౌలు సాగుదారు రైతులకు అక్కుపత్రాలను గుర్తించి ఇవ్వండని డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్ కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఏఏలు, వీఆర్వో లు, ఎంపీఈవోల సమావేశం జరిగింది. మండలంలో గతంలో 702 కౌలు హక్కు పత్రాలు పంపిణీ చేశామని, ఈ ఏడాది 1365 కౌలు రైతు హక్కు పత్రాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతుల హక్కు పత్రాల వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్ దళ్ మాట్లాడుతూ వీఏలు, వీఆర్వోలు, ఎంపీఈవోలు తమకు కేటాయించిన పనిని బాధ్యతగా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన కౌలు హక్కు పత్రాల పంపిణీ అందరూ పూర్తి చేయాలన్నారు. మండలంలోని ఏ ఒక్క కౌలు రైతు నిర్లక్ష్యానికి గురి కాకూడదని ఎవరైనా తప్పిపోతే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.